క్లుప్తంగా

బందరు తహసీల్దార్ శ్రీవిద్య బాధ్యతల స్వీకారం



చిలకలపూడి(మచిలీపట్నం): బందరు తహసీల్దార్‌గా శ్రీవిద్య శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు తహసీల్దార్‌గా పనిచేసిన డి. సునీల్‌బాబు బాపులపాడు తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సీసీఎల్‌ఏలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న శ్రీవిద్య జిల్లాకు కేటాయించడంతో ఆమెను బందరు తహసీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ రాజాబాబు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీవిద్య తొలుత కలెక్టర్ పి. రాజాబాబును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం బాధ్యతలు చేపట్టారు.

జేవీకే కిట్లకు బయోమెట్రిక్ తీసుకోండి

పెడన: ప్రతి విద్యార్థికి పూర్తి స్థాయిలో జగనన్న విద్యా కానుక (జేవీకే) కిట్లను అందించామని, సదరు విద్యార్థికి అందినట్లుగా విద్యార్థి లేదా వారి తల్లిదండ్రుల నుంచి బయోమెట్రిక్ తీసుకోవాలని పెడన ఎంఈఓ–2 వైవీ హరనాథ్ అన్నారు. శని వారం మండలంలోని ప్రధానోపాధ్యాయులు, సచివాలయాల ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్లు, సీఆర్పీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న విద్యా కానుక కిట్లు పూర్తి స్థాయిలో సరఫరా చేశామన్నారు. నాడు–నేడు పనుల నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించేలా చూడాలని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులు పురోగతిలో ఉండేలా పేరెంట్స్ కమిటీలను భాగస్వాములను చేయాలన్నారు. ఏఈ దుర్గాప్రసాద్, ప్రధానోపాధ్యాయు లు, సీఆర్పీలు, వేల్ఫేర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

దిశ యాప్‌పై అవగాహన



మోపిదేవి: మహిళలకు రక్షణ కల్పించే దిశ యాప్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ పద్మ అన్నారు. మోపిదేవి ప్రధాన జాతీయ రహదారిలో ప్రయాణిస్తున్న వాహన చోదకులకు దిశ యాప్‌పై శనివారం అవగాహన కల్పించారు. దిశ యాప్ ఉపయోగాలను వివరించారు. వారి మొబైల్ ఫోన్లలో దిశ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించారు. సచివాలయ మహిళా కానిస్టేబుల్స్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన హనుమాన్ చాలీసా మహాయజ్ఞం



టి.కొత్తపాలెం(నాగాయలంక): గ్రామంలోని విశ్వజనని సేవా సంఘం, దివిసీమ భక్త సమాజాల ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరిగిన ద్వితీయ హనుమాన్ చాలీసా మహాయజ్ఞం, పూర్ణాహుతి ప్రచార యాత్ర కార్యక్రమాలు శనివారం ముగిశాయి. హరినామ సంకీర్తన ఏకాహం, సీతారామచంద్రులకు ప్రభాత సేవ, సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకార్చన, 108 పర్యాయాలు హనుమాన్ చాలీసా పారాయణ సంకీర్తన, అన్నసంతర్పణ కార్యక్రమాలు జరిగాయి. హిందూ ధర్మ ప్రచార మండలి సభ్యులు, ధర్మాచార్యులు పర్యవేక్షించారు.

సర్వే పక్కాగా నిర్వహించండి

మండల ప్రత్యేకాధికారి జీవీ సూర్యనారాయణ

చిలకలపూడి(మచిలీపట్నం): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించి సర్వేను పక్కాగా, పారదర్శకంగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ అన్నారు. శనివారం డ్వామా కార్యాలయంలో వలంటీర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. జగనన్న సురక్ష కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించిన అనంతరం సూర్యనారాయణ మాట్లాడారు. జగనన్న సురక్ష సర్వేలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులు పూర్తిస్థాయిలో భాగస్వాములు కావాలన్నారు. ప్రతి ఆప్షన్‌ను ప్రజలకు చదివి వినిపించి వారి అభీష్టం మేరకు మాత్రమే నమోదు చేయాలన్నారు. ఇప్పటికే అనేక కుటుంబాల్లో పథకాలు, పౌరసేవలు అందుతున్నాయని, సర్వే ద్వారా ఇంకా ఎవరైనా అందని వారు ఉంటే వారికి కావాల్సిన ధ్రువీకరణ పత్రాలను అందించే దిశగా శిబిరాలు నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఇప్పటికే మండలంలో రెండు బృందాలు పర్యవేక్షణ బాధ్యత నిర్వహిస్తున్నాయన్నారు. ఎంపీడీఓ కె. బాలకృష్ణారావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఈ ఫొటోలో ఆణిముత్యాల ద్వారా వచ్చిన మెరిట్ సర్టిఫికెట్‌ను చూపిస్తున్న విద్యార్థిని పేరు పేరుబోయిన హరిత.

ఊరు కోడూరు మండలం పాలకాయతిప్ప. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. తల్లిదండ్రులతో పాటు హరిత కూడా నిల్వ కూలీ పనులకు ఇతర రాష్ట్రాలకు వెళ్లేది. ఇలా పనులకు వెళ్లడం వల్ల 2019లో పదో తరగతి పరీక్షలు రాయలేక పోయింది. ఆ మరుసటి సంవత్సరం అమ్మ ఒడి పథకం రావడంతో కష్టపడి చదివి పదో తరగతిలో 520 మార్కులు సాధించింది. గత సంవత్సరం అవనిగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ హెచ్‌ఈసీలో 1000కి 893 మార్కులు సాధించిన హరిత నియోజకవర్గంలోనే టాపర్‌గా నిలిచింది. జగనన్న ఆణిముత్యాల కార్యక్రమం ద్వారా ఈమెకు రూ.15 వేల నగదు ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం అందించింది. విద్యా, వసతి దీవెన పథకాల ద్వారా తాను డిగ్రీ చదువుకుని టీచర్ జాబ్ సాధించాలనే పట్టుదలతో ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు లేకపోతే తాను మధ్యలోనే చదువు ఆపేయాల్సి వచ్చేదని చెప్పింది. ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు తెలిపింది.

విద్యా ఒడికి పేదల పిల్లలు



నాడు - నేడు ద్వారా అవనిగడ్డ ఉన్నత పాఠశాలకు సమకూరిన నూతన భవనం




స్టేట్ థర్డ్ ర్యాంకర్ ప్రేమ్‌సాయిని జగనన్న ఆణిముత్యాలు ద్వారా సత్కరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి, డీఈఓ తాహేరా సుల్తానా (ఫైల్)

- ప్రభుత్వ పథకాలతో చదువులు
- అమ్మ ఒడి, విద్యా, వసతి దీవెనతో బడి బాట పడుతున్న విద్యార్థులు
- నాడు- నేడు ద్వారా రూ.4.48 కోట్లతో 21 పాఠశాలలు అభివృద్ధి

అవనిగడ్డ: గతంలో విద్యార్థులకు సరిపడినన్ని తరగతి గదులు, విద్యార్థినులకు మరుగుదొడ్లు సరిగా ఉండేవి కావు. దీనితో కొంతమంది విద్యార్థినులు చదువును మధ్యలో ఆపేసేవారు. జగనన్న ప్రభుత్వ వచ్చిన అనంతరం నాడు - నేడు పథకం ద్వారా మండలంలోని 21 పాఠశాలలను రూ.4.48 కోట్లతో అభివృద్ధి చేశారు. అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణంతో పాటు తాగు నీటి సౌకర్యం కల్పించారు. తొలిఫేజ్‌లో 12 పాఠశాలలను రూ.2.34 కోట్లతో అభివృద్ధి చేయగా, రెండో ఫేజ్‌లో 9 పాఠశాలలను రూ.2.14 కోట్లతో అభివృద్ధి చేశారు.

అమ్మ ఒడి నిధులు రూ.12.88 కోట్లు జమ..

అవనిగడ్డ మండలంలో అమ్మ ఒడి పథకం ద్వారా మూడు విడతల్లో 8,591 మంది విద్యార్థులకు రూ.12.88 కోట్లు తల్లుల ఖాతాలకు జమ చేశారు. తొలి విడతలో 2,606 మంది విద్యార్థులకు రూ.3.90 కోట్లు జమ కాగా, రెండో విడతలో 3,265 మంది విద్యార్థులకు రూ.4.89 కోట్లు, మూడో విడతలో 2,720 మందికి రూ.4.08 కోట్లు జమ చేశారు. వీటితో పాటు మూడు విడతలుగా 8,960 మంది విద్యార్థులకు 8 రకాల జగనన్న విద్యా కానుక కిట్లను అందించారు.



ప్రభుత్వ పాఠశాలకు ఆదరణ

గత ప్రభుత్వ హయాంలో మండలంలో మొత్తం విద్యార్థుల సంఖ్య 2,345 మంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంలో తీసుకువచ్చిన మార్పులు, సంక్షేమ పథకాలతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతూనే ఉంది. 2019–20 విద్యా సంవత్సరంలో మండలంలో మొత్తం 2,746 మంది విద్యార్థులు ఉండగా, 2020–21కి 3,049 మంది, 2021–22కి 3,165 మంది విద్యార్థులు చదువుకున్నారు. కార్పొరేట్ స్కూల్‌ను తలదన్నే రీతిలో అవనిగడ్డ ఉన్నత పాఠశాలలో ఇప్పటికే 960 మంది విద్యార్థులు ఉండగా అడ్మిషన్లు పూర్తయ్యే సరికి వెయ్యి మంది దాటి పోయే అవకాశం ఉంది.

స్టేట్ థర్డ్ ర్యాంకు సంతోషంగా ఉంది



ప్రభుత్వ పాఠశాలలో చదివిన తనకు స్టేట్ థర్డ్ ర్యాంకు రావడం చాలా సంతోషంగా ఉంది. ఏ డౌట్ వచ్చినా ఉపాధ్యాయులు చక్కగా వివరించేవారు. తమ సొంత పిల్లల్లా చదువు చెప్పారు. స్టేట్ థర్డ్ ర్యాంకు, జిల్లాలో ఫస్ట్ ర్యాంకు, నియోజకవర్గంలో ఫస్ట్ ర్యాంకు ద్వారా ప్రభుత్వం నాకు అందించిన రూ.1.15 లక్షల నగదు ప్రోత్సాహం నాకు ఎంతగానో ఉపయోగపడుతోంది.

– ఆకుల ప్రేమ్‌సాయి, అవనిగడ్డ

ఆణిముత్యాలతో విద్యార్థుల్లో పోటీతత్వం



ర్యాంకర్లను సత్కరించడం గతంలో కార్పొరేట్ స్కూల్స్, కాలేజీల్లో జరిగేవి. ఈ సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాల్లో ఆణిముత్యాలు కార్యక్రమం ద్వారా సత్కరించడం మిగిలిన వారిలో పోటీతత్వాన్ని పెంచుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తారని ఎవరూ ఊహించలేదు.

– భావిశెట్టి కావ్యశ్రీ, అవనిగడ్డ

సీట్ల కోసం పోటీపడతారు



ప్రభుత్వ స్కూల్స్, కళాశాలలను బాగా అభివృద్ధి చేస్తున్నారు. అదనపు తరగతి గదులు, వసతులు, విద్యా, వసతి దీవెన వంటి కార్యక్రమాలతో పాటు చదువు చెప్పేందుకు ఉపాధ్యాయులు పోటీ పడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో సీట్ల కోసం పోటీ పడే రోజులు వస్తాయి.

– మేడికొండ మోనా, మోపిదేవి

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

కలెక్టర్ రాజాబాబు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు. మండల పరిధిలోని మేకవానిపాలెంలోని జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణం పూర్తయిన గృహాలను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ 7.76 ఎకరాల విస్తీర్ణంలో 268 ప్లాట్లు మంజూరు కాగా 196 ఇళ్లు కేటాయించామని చెప్పారు. వీటిలో 136 ఇళ్లు బేస్‌మెంట్ దశలో ఉన్నాయని, 66 గృహాలు పూర్తయ్యాయన్నారు. ఈ లేఅవుట్‌లో మెరక పనుల కోసం రూ. 42 లక్షలు, నీటి సరఫరా నిమిత్తం రూ. 8.75 లక్షలు కేటాయించామన్నారు. అప్రోచ్ రహదారుల కోసం రూ. 8.62 లక్షలు ఖర్చు చేశామని చెప్పారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ లబ్ధిదారులతో మాట్లాడగా వారు గృహ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని, ఇప్పటికే ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది ఎప్పటికప్పుడు లే అవుట్‌లో జరుగుతున్న పనులను పర్యవేక్షిస్తున్నారని కలెక్టర్‌కు వివరించారు. లబ్ధిదారులు పట్టుదలతో ఇళ్ల నిర్మాణం ప్రారంభిస్తే తప్పకుండా పూర్తవుతుందని, ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహంతో సొంతింటి కలను నెరవేర్చుకోవాలని కలెక్టర్ వారికి సూచించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులను గుర్తించి పథకాలు అమలు చేయడంలో సమర్థతతో కూడిన పనితీరును ప్రదర్శించాలన్నారు. వారికి కావాల్సిన ధ్రువీకరణ పత్రాలు అందజేయాల్సిన బాధ్యత మీపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో మేకవానిపాలెం మాజీ సర్పంచ్ మేకా శ్రీనివాసరావు, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ తోట సత్యనారాయణ, హౌసింగ్ పీడీ జీవీ సూర్యనారాయణ, ఆర్డీఓ ఐ. కిషోర్, తహసీల్దార్ శ్రీవిద్య, ఎంపీడీఓ బాలకృష్ణ, ఈఓపీఆర్డీ జి. నరసింహారావు, ఆర్ఐ యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష.. పేదలకు రక్ష

మత్రిపాలెం(నాగాయలంక): సమస్యల పరిష్కారంలో జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు రక్షణగా నిలుస్తోందని ఏపీ స్టేట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది చిన్నారి అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంపై మత్రిపాలెం మోడల్ సచివాలయం ఆవరణలో శనివారం అవగాహన సదస్సు జరిగింది. మండల పరిషత్ అభివృద్ధి అధికారి సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ అన్ని రకాల వినతుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, ఈ సమయంలో 11 రకాల సేవలకు సర్వీస్ చార్జీలు ఉచితమని చెప్పారు. తహసీల్దార్ జె.విమలకుమారి, ఎంపీటీసీ పుట్టి స్వరూపరాణి, ఈఓపీఆర్డీ అప్పల నరసమ్మ, డీటీ నిరీషా, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

11 రకాల సేవలు ఉచితం..

పెడన: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల సేవలు ఉచితంగా అందజేయాలని తహసీల్దారు పి. మధుసూదనరావు అన్నారు. మండలంలోని మడక, బలిపర్రు గ్రామాల్లో జరుగుతున్న జగనన్న సురక్ష శిక్షణ కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. అన్ని అర్హతలు ఉండి ఇప్పటి వరకు పథకాలు పొందని వారిని గుర్తించి వారికి పథకాలు అందేలా వలంటీర్లు కృషి చేయాలన్నారు. ఇంటింటికి వెళ్లి సర్వే చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. 11 రకాల ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందజేస్తామని తెలిపారు. మచిలీపట్నం డీఎల్‌డీఓ పద్మావతి, ఈఓపీఆర్డీ జయరాము, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు. పట్టణంలోని 5, 6, 7 సచివాలయాలకు ఉదయం, 8, 9 సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు మధ్యాహ్నం మున్సిపల్ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయా వార్డులకు చెందిన కౌన్సిలర్లు, సమన్వయకర్తలు పాల్గొని జగనన్న సురక్ష ఇంటింటి సర్వే సమయంలో తీసుకోవాల్సిన అంశాలపై శిక్షణ పొందారు.

నాగాయితిప్ప గ్రామంలో అవగాహన..

నాగాయితిప్ప(మోపిదేవి): జగనన్న సురక్ష కార్యక్రమంలో గ్రామస్తులు తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చునని ఎంపీడీఓ పార్వతి అన్నారు. నాగాయితిప్ప సచివాలయం వద్ద శనివారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో జూలై 1 నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. 11 రకాల సేవలు ఎలాంటి సర్వీస్ చార్జీ లేకుండా లబ్ధిదారులకు అందేలా అధికారులు సహకరిస్తారని వివరించారు. సర్పంచ్‌లు గరికిపాటి వెంకటేశ్వరరావు, మొర్ల జ్యోత్స్న, తహసీల్దార్ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు

జూనియర్ సివిల్ జడ్జి గోపీనాథ్


అవనిగడ్డ: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి ఎల్. గోపీనాథ్ అన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాలు చిత్తవుతాయని చెప్పారు. స్థానిక ఎస్‌వీఎల్ క్రాంతి విద్యా సంస్థల ప్రాంగణంలో మత్తు పదార్థాల నివారణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. జడ్జి గోపీనాథ్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వాడకానికి అలవాటుపడి బంగారు జీవితాన్ని నాశనం చేసుకోవద్దని చెప్పారు. మత్తు పదార్థాలు తీసుకోవడం ద్వారా అన్ని విధాలా నష్టం వాటిల్లుతుందన్నారు. మత్త పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జయకుమార్ వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సనకా రఘురామప్రసాద్, ఎస్ఐ జి. రమేష్, డాక్టర్ గంగాధర్, ఏజీపీ ఈశ్వరరావు పాల్గొన్నారు.

దివిసీమలో భారీ వర్షం



కోడూరు: భానుడి భగభగలతో ఉక్కిరిబిక్కిరైన దివిసీమ ప్రజలు తొలకరి పలకరింపుతో ఉపశమనం పొందారు. రుతుపవనాల ప్రభావంతో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం ఉదయం వరకు ఎడతెరపి లేకుండా భారీ వర్షం కురిసింది. జిల్లాలోనే అత్యధికంగా నాగాయలంక మండలంలో 93.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కోడూరులో 58.4 ఎంఎం, అవనిగడ్డలో 68.8 ఎంఎం, మోపిదేవిలో 43.2 ఎంఎం, చల్లపల్లిలో 38.4 ఎంఎం, ఘంటసాలలో 16.2 ఎంఎం వర్షపాతం నమోదైంది. భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కోడూరులోని దింటిమెరక, స్వతంత్రపురం, మెరక గొడపాలెం, వీవర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లోని రహదారులపై వర్షం నీరు నిలిచింది. శనివారం మధ్యాహ్నం వరకు మోస్తారు వర్షం కురిసింది. రెండు నెలల నుంచి ఎండ తీవ్రతతో అల్లాడిన ప్రజలకు ఈ వర్షం ఊరటనిచ్చింది. అన్నదాతలు వ్యవసాయ పనులకు సమాయత్తవుతున్నారు.

మార్కెట్ యార్డు డైరెక్టర్ చంద్రావతి మృతి



గూడూరు: గూడూరు మండలం తరకటూరుపాలెంకు చెందిన పెడన మార్కెట్ యార్డు డైరెక్టర్ కమ్మిల చంద్రావతి (50) శుక్రవారం రాత్రి మృతి చెందారు. కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. తరకటూరుపాలెంలోని శ్మశానవాటికలో చంద్రావతి అంత్యక్రియలు నిర్వహించారు. గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు, కో–ఆప్షన్ సభ్యుడు కరీముల్లా, జక్కంచర్ల పీఏసీఎస్ అధ్యక్షుడు ఆత్మూరి మల్లి, గూడూరు సీహెచ్‌సీ డైరెక్టర్ బత్తిన త్రినాథ్, వైఎస్సార్ సీపీ నాయకులు కోడే చిన వెంకటేశ్వరరావు, లింగం విజయ్‌కుమార్ తదితరులు చంద్రావతి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

శ్మశాన వాటికలో ముళ్లచెట్ల తొలగింపు

మచిలీపట్నంటౌన్: స్థానిక బైపాస్‌రోడ్డులోని హిందువుల ప్రధాన శ్మశాన వాటికలో పెరిగిన ముళ్ల చెట్లను తొలగించే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మూడు రోజులుగా నగర పాలక సంస్థ జేసీబీతో ముళ్లచెట్లను తొలగిస్తున్నారు. కార్యక్రమాన్ని మాజీ కౌన్సిలర్ చిటికిన నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ 42వ డివిజన్ ఇన్‌చార్జి చీలి చక్రపాణి శనివారం పర్యవేక్షించారు.

ఓఎన్‌జీసీ సైట్‌లను పరిశీలించిన తహసీల్దార్

స్పందనలో రైతుల ఫిర్యాదుపై విచారణ



ఓఎన్‌జీసీ సైట్ పరిసరాలు, పొలాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ విమలకుమారి

వక్కపట్లవారిపాలెం(నాగాయలంక): వక్కపట్లవారిపాలెం సమీపంలో ఓఎన్‌జీసీ–సీజీఎస్ ప్లాంట్ల నిర్మాణంతో పంటలకు నష్టం వాటిల్లుతోందని పరిసరాల రైతులు స్పందన కార్యక్రమంలో చేసిన ఫిర్యాదులపై తహసీల్దార్ జె.విమలకుమారి శనివారం విచారణ చేశారు. గత సోమవారం 50 మందికి పైగా రైతులు జిల్లా స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో తహసీల్దార్ ఈ ప్రాంతంలో పర్యటించారు. ఓఎన్‌జీసీ ఉద్యోగులు, రైతులతో చర్చించారు. ఈ ప్లాంట్ల చుట్టూ ఉన్నవారంతా సామాన్య రైతులేనని, ఓఎన్‌జీసీ యాజమాన్యం నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోనందున పంటకాలువ, డ్రెయిన్లలోకి ఆయిల్ జిడ్డు చేరి కాలుష్యం కావడంతో పంటలకు నష్టం వాటిల్లుతోందని రైతులు వాపోయారు. సైట్లకు ప్రహరీలు సైతం లేకపోవడంతో కాలుష్య ప్రభావం నేరుగా పొలాలపై పడుతోందన్నారు. ఇప్పటివరకు దెబ్బతిన్న పంటకు తమకు నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరారు. తహసీల్దార్ మాట్లాడుతూ పొలాల్లోకి వచ్చిన క్రూడాయిల్ శాంపిల్స్‌ను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపిస్తున్నామని, సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులకు అందిస్తామని చెప్పారు.

అజాతశత్రువు రాంప్రసాద్

సంతాప సభలో వక్తల నివాళి



రాంప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మచిలీపట్నంటౌన్: జిల్లా కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ మాజీ అధ్యక్షుడు ఉప్పాల రాంప్రసాద్ అజాతశత్రువుగా తన జీవితాన్ని కొనసాగించారని పలువురు వక్తలు పేర్కొన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో రాంప్రసాద్ సంతాపసభ నిర్వహించారు. సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కుక్కల వీరవెంకట సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాంప్రసాద్ చిత్రపటానికి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్, పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ రాంప్రసాద్ వ్యాపారవేత్తగానే కాకుండా రాజకీయ నాయకుడిగా పెడన నియోజకవర్గంలో ఎంతో మందికి ఆర్థికసాయం చేసి ఆదుకున్నారన్నారు. ఆయన సేవలను కొనియాడుతూ ఈ ప్రాంతానికి ఇలాంటి నాయకుడు ఉండటం గర్వకారణమన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరితో ఆప్యాయంగా ఉండేవారని గుర్తుచేశారు. కార్యక్రమంలో చల్లపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కల్యాణి, వైఎస్సార్ సీపీ నాయకులు మాదివాడ రాము, ఎండీ అంజత్‌పాషా, రామిశెట్టి రాంప్రసాద్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు వేముల బుజ్జి, షేక్ మౌలాలి, మస్తాన్, బాషు, కాగిత సాగర్, ప్రసాద్, చిన్నాపురం సర్పంచ్ కాగిత గోపాలరావు, న్యాయవాదులు, బీజేపీ, టీడీపీ, కాంగ్రెస్ నాయకులు, బ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అడపా శేషు పరామర్శ..

పెడన: కాపు కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ అడపా శేషు శనివారం ఉప్పాల రాంప్రసాద్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు ఉప్పాల రాంప్రసాద్ ఈ నెల 17వ తేదీన మృతి చెందారు. రాంప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాంప్రసాద్ తనయుడు రాము, కోడలు జెడ్పీ చైర్‌పర్సన్ హారిక, రాంప్రసాద్ సోదరులు నెహ్రూ, శ్రీనివాసరావులతో మాట్లాడారు.

అర్హులందరికీ లబ్ధి చేకూరేలా చొరవ తీసుకోండి

గూడూరు తహసీల్దార్ విజయ ప్రసాద్



మాట్లాడుతున్న తహసీల్దార్ విజయప్రసాద్

గూడూరు: జగనన్న సురక్షా కార్యక్రమంలో భాగంగా అర్హులైన వారందరికీ లబ్ధి చేకూర్చేలా సచివాలయ సిబ్బంది చొరవ చూపాలని గూడూరు తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ ఆదేశించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న సురక్షా కార్యక్రమంపై పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు, వీఆర్వోలు, డిజిటల్ అసిస్టెంట్లకు సమీక్షా సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ తమ పరిధిలోని ప్రతి గడపను సందర్శించి ప్రభుత్వం ఇచ్చిన జాబితా ప్రకారం అర్హులైన వారికి ఆయా పథకాల ద్వారా లబ్ధి చేకూర్చేలా చొరవ తీసుకోవాలన్నారు. తద్వారా ప్రభుత్వ ఆశయాన్ని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి తమ వంతు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డి.సుబ్బారావు, ఈఓపీఆర్డీ పి.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రూ.14 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం

మండవల్లి: మండలంలోని కొవ్వాడలంక గ్రామ పంచాయతీ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.14 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. సీసీ రోడ్డు నిర్మాణం పనులు సర్పంచ్ జయమంగళ తిరుపతి వెంకన్న పర్యవేక్షణలో జరుగుతున్నట్లు కార్యదర్శి పి.రత్నకుమారి పేర్కొన్నారు.